విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు అవసరం

• ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

స్కూల్ డే వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్యే చల్లా

అలంపూర్, ఫిబ్రవరి 25: చిన్నత నంలో విద్యార్థులకు విద్యతోపాటు ఆటలు, పాటలు, వినోదంతో కూడిన విజ్ఞానం అవసరమని ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి అలంపూర్ మాంటిస్సోరి రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన స్కూల్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. హెచ్ఎం నాగలక్ష్మి, డైరెక్టర్ కేవీన్ రవి ప్రకాశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ జ్యోతిప్రజ్వళన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన ప్రాంతంలో ఇంటి వాతావరణాన్ని తలపించే ఈ స్కూల్ ఉండడం మన అదృష్టమన్నారు. నేటివరకు చాలామంది విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. ఉత్తమ విద్య, క్రమశిక్షణకు మారుపేరు మాంటిస్సోరి పాఠశాల అని అభివర్ణించారు. విద్యార్థుల ఆటలు, పాటలు, నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది, పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయుడు

ఉండవెల్లి, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95వ సంవత్సర 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం నిర్వహించిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయుడు పాల్గొన్నారు. మాతో కలిసి చదువుకున్న మిత్రుడు విజయుడు ఎమ్మెల్యే కావడంతో తోటిమిత్రులు సంతోషం వ్యక్తం చేశారు. తన పాతమిత్రులను కలవడం ఆనందంగా ఉన్నదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మిత్రుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తనకు చదువు చెప్పిన ఉపాధ్యాయులకు ఈ సందర్భంగా మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

• దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

ఎక్సైజ్ సీఐని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, ఫిబ్రవరి 25 : ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఎక్సైజ్ సీఐ ఓంకార్‌గౌడ్ ఉప్పల్‌కు బదిలీపై వెళ్తుండడంతో ఆదివారం పట్టణంలోని బీపీఆర్ గార్డెన్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఓంకార్‌గౌడ్ కరోనా కష్టకాలంలో ఎంతోమంది పేదలకు నిత్యావసర సరుకులను అందించి వారికి అండగా ఉన్నారన్నారు. ప్రతి ఉద్యోగి సేవా దృక్పథాన్ని అలవార్చుకోవాలన్నారు. ఆ ప్రాంతంలోనూ మెరుగైన సేవలందించి ప్రజల గుండెల్లో నిలవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, పీజే బాబు, కృష్ణారెడ్డి, విశ్వేశ్వర్, ప్రశాంత్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్తి కావస్తున్న వనపర్తి రైల్వే లైన్ సర్వే

• బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్లస్టర్ ఇన్‌చార్జి బంగారు శృతి

సమావేశంలో మాట్లాడుతున్న బంగారు శృతి

వనపర్తి, ఫిబ్రవరి 25 : వనపర్తి ప్రజల చిరకాల వాంఛ అయిన రైల్వేలైన్ సర్వే పనులు పూర్తి కావొచ్చాయని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్లస్టర్ ఇన్‌చార్జి కుమారి బంగారు శృతి పేర్కొన్నారు. బీజేపీ సంకల్ప యాత్రలో భాగంగా లక్ష్మీకృష్ణ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. డోర్నకల్ నుంచి గద్వాల్ వరకు రైల్వే లైన్ సర్వే కోసం రూ.703కోట్లు మంజూరయ్యాయని, సర్వే పనులు కూడా పూర్తి కావొచ్చాయన్నారు. వెంటనే రూ.5,530 కోట్లతో రైల్వే లైన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో కేంద్ర ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, కొల్లాపూర్‌లో ఆసియా ఖండంలోనే మొట్టమొదటి కేబుల్ బ్రిడ్జి (సోమశిల టూ సిద్దేశ్వరం) ప్రతిపాదనలు సిద్ధం చేశారన్నారు. కల్లబొల్లి మాటలతో తెలంగాణలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అనేక తిరకాసులను పెడుతున్నదన్నారు. వడ్లకు రూ.500 బోనస్, రూ.2లక్షల రుణ మాఫీ, రూ.15వేల రైతుబంధు, ఫిబ్రవరి మొదటి తారీఖున గ్రూప్-1 నోటిఫికేషన్, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జాబ్ క్యాలెండర్‌పై దాటుడు ధోరణిని అవలంబిస్తున్నదన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నారాయణ, శ్రీశైలం, రామన్‌గౌడ్, సీతారాములు, పెద్దిరాజు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులపై దాడికి నిరసన

అమరచింత, ఫిబ్రవరి 25 : ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం పాశవికంగా దాడి చేయడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా మండల నాయకులు రాజన్న కోరారు. రైతులపై డ్రోన్‌లతో దాడులు చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రజాపంథా ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమరత్నం, కురుమన్న, ప్రసాద్, రాజు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు రూ.2కోట్లు

• వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

పామిరెడ్డిపల్లిలో సీసీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి, ఫిబ్రవరి 25 : వేసవి దృష్ట్యా నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.2.02 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో వేసవిలో తాగునీటి సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోనే వనపర్తి నియోజకవర్గానికి ఎక్కువ నిధులు తీసుకొచ్చామన్నారు. నియోజకవర్గంలో ఎక్కడెక్కడ నీటి సమస్యలున్నాయో గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నియోజకవర్గంలోని ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ సమస్యలను ఈఈ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వేసవిలో తాగునీటికి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఘణపురం ఏఈ రవీందర్, పెద్దమందడి ఏఈ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు నాణ్యతగా నిర్మించాలి

పెద్దమందడి, ఫిబ్రవరి 25 : గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణాలను నాణ్యతగా చేపట్టాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మండలంలోని పామిరెడ్డిపల్లిలో జాతీయ ఉపాధి హామీ నిధుల నుంచి మంజూరైన సీసీ నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 600 మీటర్ల పొడవునా నిర్మించే సీసీరోడ్ల నిర్మాణానికి రూ.23లక్షలు మంజూరయ్యాయని, నాణ్యతగా నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రఘుప్రసాద్, ఎంపీటీసీ ఇందిరమ్మ, మాజీ సర్పంచ్ సిద్ధయ్య, తిక్కన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడులను బలోపేతం చేయాలి

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 25 : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సర్కారు బడులను బలోపేతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య అన్నారు. ఆదివారం వనపర్తిలో యూటీఎఫ్ జిల్లాస్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ముందుగా తెలంగాణ యూటీఎఫ్, తెలంగాణ టీచర్స్ యూనియన్ సంఘాల జెండాలను సీనియర్ ఉపాధ్యాయులు వెంకటయ్య, నరేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ జీవో 370లో జరిగిన నష్టాన్ని సవరించి ఉద్యోగులను స్థానిక జిల్లాలకు బదిలీ చేయాలని, ఉద్యోగోన్నతులు, బదిలీలకు, కోర్టు తీర్పు కోసం కృషి చేయాలని, పీఆర్సీ, ఏరియల్స్‌ను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. టెట్ నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని, లేనిపక్షంలో అంతర్గత జట్టును ఏర్పాటు చేయాలన్నారు. ఆదాయ పన్ను స్లాబ్ రేటును మార్చాలని కోరారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటుహక్కు కల్పించాలని, మోడల్ స్కూల్ పాఠశాలల ఉపాధ్యాయులకు బదిలీలు వెంటనే చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవి ప్రసాద్, డి.కృష్ణయ్య, వెంకటేశ్, శ్రీనివాస్‌గౌడ్, సెక్టోరియల్ అధికారి శేఖర్, వివిధ మండలాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

చిన్నారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

గోపాల్‌పేట, ఫిబ్రవరి 25 : ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపికైన సందర్భంగా మాజీ మంత్రి జిల్లెల చిన్నారెడ్డిని గోపాల్‌పేట, రేవల్లి మండలాలకు చెందిన పలు పార్టీల నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారెడ్డిని కలిసిన వారిలో రేవల్లి జెడ్పీటీసీ భీమయ్య, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, గొర్రెలకాపరుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్యయాదవ్, గణేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుడిపై కేసు నమోదు

• స్టేషన్ బెయిల్‌పై విడుదల చేయించిన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అయిజ, ఫిబ్రవరి 25: మండలంలోని ఉత్తనూరు ధన్వంతరి వేంకటేశ్వస్వామి ఆలయ అర్చకుడు భరత్ ఫిర్యాదు మేరకు స్థానిక బీఆర్ఎస్ నాయకుడు రామచంద్రారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్‌భాస్కర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఉత్తనూర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకుడు భరత్‌ను బీఆర్ఎస్ నాయకుడు రామచంద్రారెడ్డి దూర్భాషలాడి సోషల్ మీడియాలో పోస్టు చేశాడని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రామచంద్రారెడ్డిపై కేసు నమోదు చేసి ఆదివారం రాత్రి విచారణ పేరుతో ఠాణాకు తీసుకొచ్చారు. అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి రాత్రిళ్లు విచారణకు తీసుకురావడం ఏమిటని ఎస్సైతో చర్చించి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేయించారు. బీఆర్ఎస్ నాయకులతోపాటు ఉత్తనూర్ గ్రామస్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఎస్సైతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్చకుడి ప్రవర్తన సరిగా లేకపోవడంతో ఆలయంలోకి రావొద్దని ప్రశ్నించగా.. అర్చకుడు రాద్ధాంతం చేసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని పేర్కొన్నారు. విచారణ పేరుతో పోలీస్‌స్టేషన్‌లో 6గంటలపాటు ఎందుకు ఉంచుతారని ప్రశ్నించారు. దీంతో ఎస్సై స్టేషన్ బెయిల్‌పై బీఆర్ఎస్ నాయకుడిని విడుదల చేశారు. అర్చకుడిపై దౌర్జన్యం, విధులకు ఆటంకం, భయపెట్టినందుకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విచారణ నిమిత్తం మాత్రమే బీఆర్ఎస్ నాయకుడిని స్టేషన్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

రాష్ట్ర సీనియర్ మహిళల హాకీ జట్టు ఎంపిక

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 25 : జాతీయ క్రీడల్లో పాల్గొనే రాష్ట్ర సీనియర్ మహిళల హాకీ జట్టు ఎంపికను ఆదివారం జిల్లా కేంద్రంలోని బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు. రాష్ట్ర హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మార్చి 13 నుంచి 23వ తేదీ వరకు మహారాష్ట్రలోని పుణెలో నిర్వహించే జాతీయ మహిళల హాకీ క్రీడోత్సవాల్లో పాల్గొనే రాష్ట్ర జట్టును ఎంపిక చేశామన్నారు. వివిధ జిల్లాల నుంచి 80మంది మహిళా క్రీడాకారులు పాల్గొనగా 30మందిని ఎంపిక చేశామన్నారు. క్రీడాకారులు నిత్య సాధన చేస్తూ హాకీ క్రీడల్లో ప్రతిభ చాటి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులకు హైదరాబాద్‌లో శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హాకీ సహాయ కార్యదర్శి , జిల్లా కార్యదర్శి కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధ్యక్షులు మన్నెంయాదవ్, రంగారెడ్డి, అసోసియేషన్ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఆయా జిల్లాల కార్యదర్శులు, పీఈటీలు తదితరులు ఉన్నారు.

జాతీయ పోటీలకు ఎంపికైన సీనియర్ మహిళా హాకీ జట్టు

'శాఖాహారం ముద్దు, మాంసాహారం వద్దు'

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 25 : లోక కల్యాణం కోసం అహింసాయుత విధానాన్ని ఆవిష్కరించడానికి నడుం బిగిద్దామని, శాఖాహారం ముద్దు.. మాంసాహారం వద్దని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా, రాజీవ్ చౌరస్తా, కొత్త బస్టాండ్, జీ గార్డెన్ వరకు మహార్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస అని, ధ్యానం, శాఖాహారం పిరమిడ్ శక్తి అని అన్నారు. బుద్ధుడు సూచించిన అహింసా మార్గంలో పయనించాలన్నారు. అనంతరం ధ్యానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో పత్రీజీ అంతర్గత కార్యదర్శి దామోదర్ మహాస్వామి, రాధాకృష్ణారెడ్డి, ఉమేష్ తదితరులు ఉన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ స్పిరిచ్యువల్ సభ్యులు

గట్టుకాడిపల్లిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 25 : మండలంలోని గట్టుకాడిపల్లిలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు, నిర్వాహకులు స్వామికి ప్రత్యేక పూజలు చేసి రథాన్ని లాగారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. ఆదివారం బలిహరణం, అశ్వ వాహనం, తీర్థ ప్రసాదాలు, మహాపూర్ణాహుతి, అవభృథ స్నానము, రాత్రి దోపు, శేషవాహనం, ధ్వజావరోహణం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు తదితరులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

తిమ్మప్పస్వామి రథోత్సవం .. రమణీయం

కట్టకింద తిమ్మప్పస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

అయిజ, ఫిబ్రవరి 25: పట్టణానికి సమీపంలోని కట్టకింద తిమ్మప్పస్వామి రథోత్సవం రమణీయంగా సాగింది. మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం 12గంటలకు దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో కట్టకింద తిమ్మప్పస్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు రథాంగ హోమం నిర్వహించిన వేద పండితులు, కుంభంకాగుతో శ్రీవారికి నైవేద్యం సమర్పించిన మీదట భక్తుల గోవింద నామస్మరణలు, మేళ తాళాలు, భాజాభజంత్రీలు, పటాకుల మోతల నడుమ శ్రీవారి రథోత్సవాన్ని కనులపండుగవగా నిర్వహించారు. రథోత్సవానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి శ్రీవారికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గుంటి రంగనాథుడి రథోత్సవం

మండలంలోని రాజాపురంలో వెలిసిన గుంటి రంగనాథస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం తెల్లవారు జామున 2గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గుంటి రంగనాథుడిని రథంపై ఆశీనులను చేసిన ఆలయ కమిటీ సభ్యులు భక్తుల గోవింద నామస్మరణల నడుమ రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతకుముందు గుంటి రంగనాథుడిని పల్లకీలో గ్రామంలో ఊరేగించారు.

తిక్కవీరేశ్వరుడి బ్రహ్మోత్సవాలకు వేళాయే..

• *రేపటినుంచి మార్చి 11వరకు ఉత్సవాలు*

• *ఏర్పాట్లు పూర్తి చేస్తున్న దేవస్థాన కమిటీ*

అయిజ, ఫిబ్రవరి 25: తిక్కవీరేశ్వరుడి బ్రహ్మోత్సవాలకు వేళాయే. పిలిస్తే పలికే దైవం .. కొలిచిన వారి కోర్కెలు తీర్చే కొంగు బంగారం.. తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు దేవస్థాన కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. అయిజ పట్టణంలో తిక్కవీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి మార్చి 11వరకు నిర్వహించేందుకు దేవస్థాన కమిటీ నిర్ణయించింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఏటా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలను కనుల పండువగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలొచ్చి తిక్కవీరేశ్వరస్వామికి మొక్కులు చెల్లించుకోనున్నారు. ఇందుకు ఆలయ ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు. ఆలయానికి రంగురంగుల విద్యుద్దీపాలను అలంకరించారు.

కార్యక్రమాల వివరాలు..

పట్టణంలోని తిక్కవీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తిక్కవీరేశ్వరస్వామి ఉత్సవ విగ్రహం ఊరేగింపు, కలశస్థాపన, రాత్రి చట్టసేవ నిర్వహిస్తారు. 28న సాయంత్రం హోమం, రాత్రి ప్రభోత్సవం, 29న ఉదయం నిత్యపూజలు, రాత్రి 12:15 గంటలకు మహ రథోత్సవం నిర్వహించనున్నారు. మార్చి 1న సందెరాళ్లు ఎత్తు పోటీలు, 2న అంతర్రాష్ట్ర భజన పోటీలు, ఓపెన్ కబడ్డీ టోర్నీ, 4న జాతీయ స్థాయి కుస్తీ పోటీలు, 5న ఒంటెద్దు బండి గిరక పందెం పోటీలు, 6న అంతర్రాష్ట్ర పొట్టేళ్ల పోట్లాట పోటీలు, గతేడాది పదో తరగతిలో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులకు సత్కారం ఉంటుందని ఆలయ కమిటీ తెలిపింది.

తిక్కవీరేశ్వర స్వామి మూల విగ్రహం

అనుమతుల్లేకుండా వరాహ పోటీలు

• నిలిపివేసిన పోలీసులు

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 25 : జిల్లా కేంద్రం సమీపంలోని సంగాల చెరువులో ఆదివారం అనుమతులు లేకుండానే అధికార పార్టీకి చెందిన కొందరు వరాహ పోటీలను నిర్వహించారు. కాగా జిల్లాతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద మొత్తంలో వరాహాలో పాల్గొనగా బెట్టింగ్ జోరుగా నడిచింది. ప్రతి పోటీకి పై పందెంగా(బెట్టింగ్) దాదాపు రూ.2లక్షలకు పైగా చేతులు మారాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పోటీలను నిలిపివేసి నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయానికి సంబంధించి గద్వాల టౌన్ ఎస్సై శ్రీనివాస్‌ను వివరణ కోరగా విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందిని పంపి పోటీలను నిలిపివేశామని, నిర్వాహకులపై ఆరా తీస్తున్నామన్నారు. అయితే పోలీస్ అధికారులకు కూడా సమాచారం ఇవ్వకుండా పోటీలు నిర్వహించడమేంటని జిల్లా ప్రజలు చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ చోటా నాయకులు తమ లీడర్ అండదండలతో ఈ వ్యవహారం నడిపినట్లు గుసగుసలు వినబడుతున్నాయి.

నిజాయితీ చాటిన 108 సిబ్బంది

నగదును వైద్యురాలికి అందజేస్తున్న 108 సిబ్బంది

కొత్తకోట, ఫిబ్రవరి 25 : పట్టణ సమీపంలోని మదర్ థెరిస్సా జంక్షన్ వద్ద షేక్ ఇమాం అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. 108 సిబ్బంది ప్రభాకర్, రాఘవేందర్ ఆసుపత్రిలో చేర్పించి ఇమాంకు సంబంధించిన రూ.38వేలు సహ ఏటీఎం, ఐడీ కార్డులను డ్యూటీ డాక్టర్ మాళవికకు అప్పజెప్పారు. హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు బైక్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు 108 సిబ్బంది తెలిపారు. వెంటనే షేక్ ఇమాం బంధువులకు సమాచారం అందించగా అంబులెన్స్ సిబ్బంది నిజాయితీని వైద్యులు కొనియాడారు.

ఎంసెట్ మెటీరియల్ పంపిణీ

పుస్తకాలను అందజేస్తున్న లెక్చరర్ కురుమూర్తి

ఆత్మకూరు, ఫిబ్రవరి 25 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆంగ్ల అధ్యాపకుడు కురుమూర్తి ఆదివారం పుస్తకాలను పంపిణీ చేశారు. ఇంటర్ తరువాత విద్యార్థులకు ఉపయోగపడేలా ఎంసెట్ మెటీరియల్, స్పోకెన్ ఇంగ్లిష్ కోచింగ్ పుస్తకాలను ఉచితంగా అందించారు. ప్రభుత్వ కళాశాలలో విద్యనభ్యసించే పేద విద్యార్థులకు తనవంతుగా పుస్తకాలను అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు, లెక్చరర్లు కురుమూర్తిని అభినందించారు.

కరాటేపోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పతకాలు సాధించిన విద్యార్థులు

ఎర్రవల్లి చౌరస్తా, ఫిబ్రవరి 25: కరాటే పోటీల్లో ఎర్రవల్లి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. హైదరరాబాద్ లోని పాల్స్‌గ్రామర్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన కంగ్‌పూ కరాటే పోటీల్లో ఎర్రవల్లి విద్యార్థులు పాల్గొని బంగారు, వెండి పతకాలు సాధించారని మాస్టార్లు విజయ్, రాజు తెలిపారు. సీనియర్స్ బాయ్స్ స్పైరింగ్ విభాగంలో జగదీశ్, రక్షిత్, కార్తీక్, చక్రధర్ బంగారు పతకాలు సాధించగా రేవంత్‌రెడ్డి, గోకుల్ వెండి పతకాలు సాధించారు. సీనియర్ బాలికల విభాగంలో నందిని బంగారు పతకం, యక్షిత వెండి పతకం, బాలుర కటాస్ విభాగంలో జగదీశ్, వీరేశ్ బంగారు పతకాలు, వేణుతేజ, గోకుల్, దినేశ్ వెండి పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులకు మాస్టార్లు శ్రీనివాస్, రాజు, అరుణ్ బహుమతులు ప్రదానం చేశారు. కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

మట్టిలో మాణిక్యాలను గుర్తించాలి

సివిల్ సర్వీసెస్‌పై అవగాహన కల్పిస్తున్న మనోజ్

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 25 : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు సివిల్ సర్వీసెస్‌కు సంబంధించిన శిక్షణపై అవగాహన కల్పిస్తూ మట్టిలోని మాణిక్యాలను వెలికితీయొచ్చని నారాయణ విద్యాసంస్థల డీన్ మనోజ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో సివిల్స్ కోర్సుపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ప్రొఫెసర్ కోదండరాం, డీఎస్‌వో సుబ్బారెడ్డి, ఐఏఎస్ అకాడమీ ప్రిన్సిపాల్ మంజులారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో చురుకైన విద్యార్థులున్నారని, సరైన ప్రోత్సాహం లేక వారి ప్రతిభను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించలేకపోవడం విచారకరమన్నారు. సివిల్స్‌పై ఆసక్తిని పెంచి సరైన శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి పరమేశ్వరరావు, టెన్త్, ఇంటర్ విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు తదితరులు హాజరయ్యారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

ప్లాట్లు కొనబడును
★ హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, పసుమాముల, రామోజీ, కోహెడ, సాగర్ పంపు, గుంతపల్లి, బాటసింగారం, తూప్రాన్‌పేట్, మల్కాపురం, పోచంపల్లిలో ప్లాట్లు కొనబడును. J.సుధాకర్ గౌడ్: 9948172307, 9390846522.
NT-313886

WANTED
★ హైదరాబాద్‌లో అర్జెంటుగా కొండాపూర్‌కి సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం, భోజనం, వసతి కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-313897-All

FINANCIAL SERVICES
★ రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార రుణం, అతి తక్కువ వడ్డీ రేటుతో, సిబిల్ అవసరం లేదు! NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏజెంట్స్ కావలెను. నోవా ఫైనాన్స్. ఫోన్: 7696660523.
NT-311956-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794